చదువు

మా చిరునామా:
చదువు
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ,
హైదరాబాద్ - 501 512
■ edc@eenadu.net

ఈనాడు
హైదరాబాద్, సోమవారం జనవరి 8, 2018

ప్రిలిమ్స్‌లోనే పెను సవాల్!!

ప్రాథమిక పరీక్ష ద్వారా ప్రధాన పరీక్షకు ఎంపిక చేసే అభ్యర్థుల సంఖ్యను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తగ్గించింది. మరో వైపు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కూడా సంస్కరణల బాటలో ఉంది. ఈ పరిణామాలను ఉద్యోగార్థులు గమనిస్తుండాలి. అవగాహనతో కొత్త పరిస్థితులకు అనుగుణంగా సన్నద్ధతలో మార్పులు చేసుకోవాలి. ఇందుకు ఉపకరించే విశ్లేషణ ఇదిగో..!

ఇరవై అయిదు వేల మందికి మించి అభ్యర్థులు రాసే నియామక పరీక్షల్లో ప్రాథమిక, ప్రధాన పరీక్షలు (ప్రిలిమ్స్, మెయిన్స్) నిర్వహించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంగీకరించింది. ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్‌కు అభ్యర్థులను ఎంపిక చేయడానికి 1:15 నిష్పత్తిలో ఎంపిక చేసే కీలక మార్పుతో తాజాగా జీవో కూడా విడుదలయింది. కేటగిరీలోని ఉద్యోగాల సంఖ్యను బట్టి ఆయా కేటగిరీ వాళ్లనే 1:15 నిష్పత్తిలో ఎంపిక చేసే నిర్ణయమూ జరిగింది.

కొడాలి భవానీ శంకర్

ఇప్పటివరకూ జరిగిన ప్రిలిమ్స్-మెయిన్స్ పరీక్షలన్నీ 1:50 నిష్పత్తిలో ఎంపిక చేసేవారు. కేటగిరీని పట్టించుకునేవారు కాదు. ఫలితంగా ఒక మాదిరిగా చదివినవారు కూడా మెయిన్స్‌కు ఎంపికయ్యేవారు. కానీ సరైన సామర్థ్యాలు లేక అంతిమ ఫలితం పొందలేకపోయేవారు. దాంతో చాలామందికి ధన, కాల వ్యయం వృథా జరిగేది. చాలామంది పోటీ పరీక్షార్థుల జీవితం గందరగోళానికి లోనయ్యేది. ఇప్పుడు 1:15 నిష్పత్తి, అందులోనూ కేటగిరీ ఆధారంగా ఎంపిక చేసే పరిస్థితి వల్ల పూర్తి సామర్థ్యమున్న అభ్యర్థులే మెయిన్స్‌కు ఎంపికవుతారు. ఒక రకంగా ఆషామాషీ అభ్యర్థులు వైదొలగడం వల్ల అనవసర అసంతృప్తి, ఆందోళనలు తగ్గి సజావుగా పరీక్షలు జరిగే పరిస్థితి ఏర్పడుతుంది.

కొత్త పద్ధతిలో జనరల్ కేటగిరీ ఉద్యోగాల సంఖ్యను బట్టి మెరిట్ ప్రకారం 1:15 నిష్పత్తిలో మొదట ఎంపిక జరుగుతుంది. ఈ విభాగంలో ఎవరైనా ఎంపికయ్యే అవకాశముంది. తరువాత కేటగిరీ లవారీగా ఆయా కేటగిరీల అభ్యర్థులను 1:15 నిష్పత్తిలో ఎంపిక చేస్తారు. జనరల్ సహా అన్ని కేటగిరీల్లోనూ 1/3వ వంతు నిష్పత్తిలో మహిళా రిజర్వేషన్‌ను కూడా పాటిస్తారు. వికలాంగులు మొదలైన వర్గాలకు సంబంధించిన పోస్టుల సంఖ్యను బట్టి ఆయా వర్గాల వారి నుంచే 1:15 నిష్పత్తిలో అభ్యర్థుల ఎంపిక జరుగుతుంది. తగినంతమంది అభ్యర్థులు లభ్యం కాకపోతే కటాఫ్‌ను తగ్గించే అధికారం పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు ప్రభుత్వం ఇచ్చింది. ఫలితంగా సమ పోటీ ఏర్పడి, ఎక్కువమందికి అవకాశం కల్పించే పరిస్థితి ఏర్పడింది.

ఇటువంటి పరిస్థితిలో మెయిన్స్‌కి ఎంపిక కావడం ఒక పెద్ద ఛాలెంజ్ అని చెప్పవచ్చు. ఒకవిధంగా జీవన్మరణ సమస్యలా అభ్యర్థులు భావించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఏ పరీక్షార్థులు ఏం చేయాలి?

కొత్త పరిణామాల నేపథ్యంలో ఉద్యోగార్థులు పటిష్ఠ వ్యూహం పాటించటం అనివార్యం.

గ్రూప్–1

ఇప్పుడే సన్నద్ధత మొదలు పెట్టినవారు, మొదలు పెడదామనుకునేవారు పూర్తి సమయాన్ని స్క్రీనింగ్ సిలబస్‌కి కేటాయిస్తే మంచిది. స్క్రీనింగ్ సిలబస్‌పై పట్టు సాధించేందుకు కనీసం నాలుగు నెలల పాటు రోజుకు 4-6 గంటలు వెచ్చించాలి. పైగా ప్రస్తుతం అడుగుతున్న ప్రశ్నల్లో అత్యధికం అప్లికేషన్, వినియోగానికి సంబంధించినవి కావడంతో పూర్తి స్థాయిలో అవగాహన ఏర్పడేలా చదివితేనే ప్రయోజనం ఉంటుంది. ఇటీవలి కాలంలో జనరల్ స్టడీస్‌లో 100-105/150 మార్కులు చాలామంది అభ్యర్థులు సాధిస్తున్నారు. అందువల్ల గతంలో మాదిరిగా 85-90 మార్కుల్లో స్క్రీనింగ్ గట్టెక్కే పరిస్థితి లేదు.

సీనియర్ అభ్యర్థులు పూర్తిగా మెయిన్స్ పేపర్లపై దృష్టిసారించడం ప్రస్తుత పరిస్థితుల్లో సరైన నిర్ణయం కాదు. సన్నద్ధత సమయంలో కనీసం 1/3వ వంతు స్క్రీనింగ్ సిలబస్‌కు కేటాయించడం హేతుబద్ధ నిర్ణయం అవుతుంది.

తాజాగా సన్నద్ధత మొదలు పెట్టినవాళ్లు మెయిన్స్ భారం, భయం అనుకుంటే స్క్రీనింగ్ సిలబస్‌లో ఉన్న పాలిటీ, సైన్స్-టెక్నాలజీ, ఇండియన్ ఎకానమీ, భారతదేశ చరిత్ర లాంటి అంశాలను ఇంటిగ్రేట్ చేసి చదువుకునే వ్యూహాన్ని కూడా అనుసరించవచ్చు. తద్వారా కొంత మెయిన్స్ భారం కూడా తగ్గుతుంది.

గ్రూప్–2

ప్రస్తుతం ఉన్న గ్రూప్-2 స్క్రీనింగ్ సిలబస్‌లో పాలిటీ, ఎకానమీ, వర్తమానాంశాలు ఉన్నాయి. ఇవే పాలిటీ, ఎకానమీలు మెయిన్స్‌కు కూడా ఉపయోగపడతాయి. కాబట్టి పూర్తిస్థాయిలో లోతైన అధ్యయనం ఈ రెండు విభాగాల్లో చదవడం వల్ల మెయిన్స్‌కు కూడా సిద్ధపడినట్లే అవుతుంది. స్క్రీనింగ్‌కు చదివేటప్పుడే మెయిన్స్ సిలబస్ అంశాలు కూడా అనుసంధానం చేసుకుని ఈ రెండు విభాగాలనూ చదవటం మంచి వ్యూహం అవుతుంది.

స్క్రీనింగ్ సిలబస్‌లో వివిధ కోణాల్లో కరెంట్ అఫైర్స్ చదవమని సూచించారు. ప్రతిరోజూ నిరంతరం కరెంట్ అఫైర్స్ చదవడం వల్ల సైన్స్, ఆర్థిక, రాజకీయ, కళలు, క్రీడలు మొదలైన సబ్జెక్టుల్లో మెయిన్స్‌కు కావాల్సిన సమాచారం కూడా లభ్యమైనట్లే.

ఏపీ ఎకానమీ, ఏపీ చరిత్ర మెయిన్స్‌లోని జనరల్ స్టడీస్‌లోని మిగతా అంశాలు స్క్రీనింగ్ అనంతరం చదవడం మంచిది. లేదా ముందుగా స్క్రీనింగ్‌పై పట్టు పూర్తిస్థాయిలో లభించింది అనుకుంటే మిగతా మెయిన్స్ అంశాలపై దృష్టిపెడితే సరిపోతుంది.

ఇతర అభ్యర్థులు

◆ పంచాయతీ కార్యదర్శి, వీఆర్ఓ మొదలైన పరీక్షల అభ్యర్థులు పెద్దఎత్తున హాజరయ్యే పరీక్షలకు కూడా ముందస్తుగా స్క్రీనింగ్ సిలబస్‌కు తయారైతేనే మంచిది. ఈ పరీక్షలు మాత్రమే రాసే అభ్యర్థులు స్క్రీనింగ్‌లో గట్టి పట్టు వస్తేనే గ్రూప్-1, 2, సివిల్స్ అభ్యర్థులను స్క్రీనింగ్‌లో ఎదుర్కోగలుగుతారు.

◆ ఏఈఈ వంటి పరీక్షల్లో స్క్రీనింగ్ సిలబస్‌లో జనరల్‌స్టడీస్ పాత్ర 50 మార్కులకే పరిమితం. కానీ సిలబస్ భారీ స్థాయిలో ఉంది. ఇలాంటి ప్రత్యేక నిపుణత సంబంధిత పరీక్షల్లో స్క్రీనింగ్‌లో కూడా వారి సబ్జెక్టులు 2/3వ వంతు భాగాన్ని ఆక్రమించినా మెయిన్స్‌కి ఎంపిక కావాలంటే తప్పనిసరిగా జనరల్‌స్టడీస్ మార్కులే ప్రధానమని చెప్పవచ్చు. ఎందుకంటే సబ్జెక్టు సంబంధిత విభాగాల్లో దాదాపుగా ప్రతిభావంతులైన అభ్యర్థులు ఒకేరకమైన మార్కులను పొందుతారు. కానీ జనరల్‌స్టడీస్‌లోని లోతు, పరిధి దృష్ట్యా మార్కులు పొందడం క్లిష్టమే. అయితే ఆ వచ్చే మార్కులే స్క్రీనింగ్ నుంచి మెయిన్స్‌కు దారి తీస్తాయని గమనించాలి. మెయిన్స్‌లో 150 మార్కులకు ఎలాగూ జనరల్‌స్టడీస్ ఉంది కాబట్టి, ఆ స్థాయిలో స్క్రీనింగ్ సిలబస్‌ను చదివితే ఒకే సన్నద్ధతతో రెండు పరీక్షల్లో రాణించవచ్చు.

అటు ఏఈఈ, డీఎల్, జేఎల్ వంటి నిపుణత సంబంధిత ఉద్యోగాల పరీక్షలు రాసే అభ్యర్థులు ప్రస్తుత మారిన పరిస్థితుల్లో గ్రూప్ 1, 2 పరీక్షల స్క్రీనింగ్ గట్టెక్కాలి అంటే ప్రత్యేకంగా జనరల్‌స్టడీస్‌పై పట్టు సాధించాలి. రెండు పరీక్షలనూ వాటి స్థాయి జనరల్‌స్టడీస్ సన్నద్ధతతో ఎదుర్కోవడం కష్టం. అందువల్ల గ్రూప్-1, 2 స్థాయి జనరల్ స్టడీస్‌లో ఇటు ఈ పరీక్షలతోపాటు వారి నిపుణత సంబంధిత ప్రశ్నలనూ ఎదుర్కోగలుగుతారు.

టీఎస్‌పీఎస్‌సీ పరీక్ష విధానంలో సంస్కరణలు

తెలంగాణ స్టేట్ సర్వీస్‌ల ఏర్పాటు ద్వారా గ్రూప్స్ నియామకాలు జరిపేందుకు తెలంగాణ రాష్ట్రం సిద్ధపడుతోందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో 70:30 నిష్పత్తిలో యూపీఎస్‌సీ సిలబస్, టీఎస్‌పీఎస్‌సీ సిలబస్ ఉండే అవకాశం ఉంటుంది. అయితే అభ్యర్థులు పాత సిలబస్ స్థానంలో ఈ సిలబస్‌ను భారంగా, క్లిష్టంగా భావించే అవకాశముంది. ఒకవేళ ఈ మార్పు వాస్తవమైతే సన్నద్ధతలో మార్పుల ద్వారా మంచి మార్కులు సాధించవచ్చు. సివిల్స్ రాసే అభ్యర్థులను పెద్ద పోటీగా భావించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే తెలంగాణ చరిత్ర, తెలంగాణ ఉద్యమం, సామాజిక నిర్మితులు, జాగ్రఫీ, ఎకానమీ వంటి అంశాల్లో వారికి అవరోధాలు ఎలాగూ ఉంటాయి.

గ్రూప్-1, 2 ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలను ఒకే ఉమ్మడి పరీక్ష ద్వారా నిర్వహించినట్లయితే ఇప్పటివరకూ ఆబ్జెక్టివ్ ధోరణిలో తయారైన అభ్యర్థులు సబ్జెక్టివ్ విధానానికి మారాల్సి ఉంటుంది. అందువల్ల ఈ ప్రతిపాదిత మార్పులు ప్రభుత్వ ఆమోదం పొందితే గెజిటెడ్ ఉద్యోగాలు ఆశిస్తున్న అభ్యర్థులు ఇప్పటినుంచే వివిధ సిలబస్‌ల అంశాలను అవగాహన, అన్వయం, వినియోగం కోణాల్లో చదవాల్సి ఉంటుంది.

గ్రూప్-3, 4 ఉద్యోగాలకు కూడా ఉమ్మడి నోటిఫికేషన్ ద్వారా నియామకం జరిగేట్లయితే సిలబస్ మార్పులను అధ్యయనం చేయాలి. అందుకు అనుగుణంగా సన్నద్ధతలో మార్పులు రావాలి. ఈ విషయాల్లో స్పష్టత వచ్చేవరకూ అభ్యర్థులు ప్రధానంగా జనరల్‌స్టడీస్‌పై పట్టుకు ఈ సమయాన్ని వినియోగించుకోవాలి.



జనరల్‌స్టడీస్‌పై పట్టు సాధిస్తే స్క్రీనింగ్‌లో విజయం సాధించడమే కాకుండా మెయిన్స్‌కు కావాల్సిన ముందస్తు తయారీ కూడా ముగిసినట్లే. నోటిఫికేషన్లు వచ్చిన తరువాత చూడొచ్చనుకుంటే... సమగ్ర తయారీకి సమయం సరిపోదని గుర్తించాలి.

రివిజన్ మళ్లీ మళ్లీ!

రాజేష్ తెలివైన విద్యార్థి. ఎప్పటి పాఠాలు అప్పుడు బాగా చదువుకుంటాడు. స్లిప్ టెస్ట్‌లు, మంత్లీ టెస్ట్‌ల్లో మార్కులు బాగా వస్తాయి. కానీ ఇంటర్ మొదటి సంవత్సరం ఫైనల్ పరీక్షల్లో అనుకున్న పర్సంటేజ్ రాలేదు. టెన్త్‌లో కూడా అలాగే జరిగింది. దీంతో ఆందోళన పెరిగిపోతోంది. నిరాశతో డిప్రెషన్‌కు గురయ్యాడు. నిపుణులను సంప్రదిస్తే చదివింది మళ్లీ సరిగా రివిజన్ చేయకపోవడంతో సమస్య తలెత్తిందని గుర్తించారు. అంతా చదివేశాం... వచ్చేసింది అయినా సరిగా రాయలేకపోయాం అని బాధపడే విద్యార్థులు రివిజన్ ప్రాధాన్యాన్ని గ్రహించడం లేదు. చదవడం అంతా ఒక ఎత్తయితే దాన్ని పునశ్చరణ చేయడం మరో ఎత్తు. సరిగా రివిజన్ చేస్తే కావాలనుకున్న మార్కులు కచ్చితంగా సొంతమవుతాయి.

చదువుకు సంబంధించి SQ3R (Survey, Question, Read, Repeat, Revise) పద్ధతి శాస్త్రీయమైంది. సర్వే అంటే సిలబస్‌లో, పారంలో అసలు ఏముందో స్థూలమైన అవగాహన ఏర్పరచుకోవడం. క్వశ్చన్ అంటే అవగాహనను ప్రశ్నలు, జవాబుల రూపంలోకి మార్చుకోవడం. రీడ్- మనకు వచ్చే దాకా చదవడం. రిపీట్, రివైజ్‌లను కలిపి స్థూలంగా రివిజన్ అని వ్యవహరిస్తారు.

డా. టి.ఎస్.రావు
కౌన్సెలింగ్ సైకాలజిస్ట్

జ్ఞాపకాలు తాత్కాలికం, శాశ్వతం అని రెండు రకాలు. చదువును శాశ్వత జ్ఞాపకాల్లోకి చేర్చాలి. అందుకు తగిన ప్రాక్టీస్ చేయాలి. ఒక పాఠాన్ని ఎంత బాగా చదివినా క్రమం తప్పకుండా రివిజన్ చేస్తేనే అది శాశ్వత జ్ఞాపకాల్లోకి చేరుతుంది. అలా చేరితేనే పరీక్షల్లో బాగా రాయగలుగుతారు.

ఒకసారి వచ్చే దాకా చదివితే అది 24 గంటలు గుర్తుంటుంది. 24 గంటల తర్వాత చదివితే వారం రోజుల వరకు గుర్తుంటుంది. వారం లోపు మళ్లీ చదివితే నెల జ్ఞాపకం ఉంచుకోవచ్చు. నెలలోపు నాలుగోసారి చదివితే 3 నెలల వరకు ఢోకా ఉండదు అనేది శాస్త్రీయంగా రుజువైంది. అంటే ప్రతి 3 నెలలకూ ఇంతకు ముందు చదివిందంతా రివిజన్ చేసుకోవాలి.

వారాల పద్ధతి

ఈ పద్ధతిలో ఫార్ములాలు, సంవత్సరాలు, వ్యతిరేక పదాలు, పర్యాయపదాలు, గ్రంథాలు-రచయితలు లాంటివి రోజూ చదవాల్సిన జాబితాలో చేర్చాలి (ఆదివారం మినహా). నిర్వచనాలు, కంఠస్థ పద్యాలు, కొటేషన్లు కనీసం వారానికి మూడుసార్లు చదవాలి (మంగళ, గురు, శని). 2-5 వాక్యాలలోపు ఉండి కొద్దో గొప్పో మార్చి రాయడానికి అవకాశం ఉన్న జవాబులను వారానికి రెండుసార్లు (సోమ, శుక్ర), వ్యాస రూప సమాధానాలను వారానికి ఒకసారి (ఆదివారం) రివిజన్ చేస్తే ఉత్తమం.

పరీక్షల నెలల్లో రోజూ రివిజన్‌కి ముందు 3 గంటలు కేటాయించాలి. పై 4 రకాల రివిజన్లు ఒకేరోజు రాకుండా వేర్వేరు రోజుల్లో వచ్చే విధంగా ప్లాన్ చేయాలి.

సమయం వృథా కాకుండా..!

కావాల్సిన పుస్తకాన్ని వెతుక్కోవడంలో, ఏది రివిజన్ చేయాలో నిర్ణయించుకోవడం లేదా గుర్తుచేసుకోవడంలో రోజుకి కనీసం 15 నిమిషాలు వృథా అయినా 200 రోజులకు 3000 నిమిషాలు అంటే 50 గంటలు కోల్పోతారు. అందుకే సబ్జెక్టుకు ఒక రంగు కేటాయించుకొని అట్టలు వేసుకోవాలి. అట్టలు వేయడం కుదరకపోతే అన్ని వైపుల నుంచి స్పష్టంగా కనిపించే విధంగా కాగితం లేదా స్టిక్కర్ అంటించాలి. దీని వల్ల ఏ పుస్తకం ఏదో పేజీలు చూడకుండానే గుర్తించగలుగుతారు.

ఆసక్తికరంగా..!

రివిజన్ ఆసక్తికరంగా సాగడానికి కొన్ని చిట్కాలు పాటించవచ్చు. స్టడీ టేబుల్ మీద మూడు లేదా నాలుగు రంగుల బాక్సులు పెట్టుకోవాలి. లేదా మీ బుక్ కేసును వేర్వేరు రంగులతో భాగాలుగా విడదీయాలి. ఉదయం నిద్ర లేవగానే కొత్తగా చదవాల్సినవి ఎరుపు రంగు ప్రదేశంలో ఉంచాలి. రివిజన్ చేయాల్సినవి పసుపు, చూడకుండా రాయాల్సినవి, అప్పజెప్పాల్సినవి ఆకుపచ్చ రంగు ప్రదేశాల్లో ఉంచుకోవాలి.

మనం 4 రకాల రివిజన్‌ల గురించి అనుకున్నాం. వాటిలో వారానికి 6 రోజులు చదవాల్సిన నోట్సులకు ఎరుపు, వారానికి మూడు రోజులు చదవాల్సిన పుస్తకాలకు ఆకుపచ్చ, వారానికి రెండు రోజులు చదవాల్సిన వాటికి నీలం, వారానికోసారి చదివే దానికి పసుపు రంగు అట్టలు వేయాలి. వారాలకు కూడా వరుస అంకెలు కేటాయించి వాటిని ఆ పుస్తకాలపై కనిపించేలా వేసుకోవాలి. అప్పుడు ఏ రోజు ఏ పుస్తకం చదవాల్లో తేలిగ్గా గుర్తించవచ్చు. సరైన ప్రణాళిక రూపొందించుకొని, జాగ్రత్తలు పాటిస్తే రివిజన్ విజయవంతంగా పూర్తిచేయవచ్చు.

కొన్ని సూత్రాలు

■ కొత్తవి నేర్చుకునే క్రమంలో పాత పాఠాలు మరచిపోకుండా చూసుకోవాలి. ■ ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోడానికి క్రమం తప్పకుండా రివిజన్ చేయాలి. ■ పాత పాఠాలు ఎంత బాగా గుర్తుంటే కొత్తవి అంత త్వరగా వస్తాయని గుర్తించాలి. ■ రివిజన్ అంటే అప్పజెప్పడం కాదు. అది జ్ఞాపకాలను తాజాగా ఉంచుకోడానికి అవలంబించే పద్ధతని గ్రహించాలి. ■ మొదట ఏ పుస్తకంలో చదివామో చివరి వరకూ అదే పుస్తకంలో చదవాలి. పుస్తకాలు మారిస్తే రివిజన్ ప్రయోజనం తక్కువ.

దూరవిద్యలో ఫైర్‌సేఫ్టీ

■ బీఏ చదివాను ఫైర్ అండ్ సేఫ్టీ కోర్సును దూరవిద్య ద్వారా చదవాలనుకుంటున్నాను. కుదురుతుందా? అందించే సంస్థలేవి?

– కె. నాగరాజు

జ: ఫైర్ ఫైటింగ్, విపత్తును ఎదుర్కోవడం, ఆస్తి, ప్రాణనష్టాన్ని తగ్గించడం వంటి వివిధ కార్యకలాపాలను చూసుకోవడమే ఫైర్ అండ్ సేఫ్టీ ఆఫీసర్ ముఖ్య ఉద్దేశం. దూరవిద్య ద్వారా ఈ కోర్సును (డిప్లొమా ఇన్ ఫైర్ అండ్ సేఫ్టీ) ఇగ్నో, దిల్లీ వారు, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైర్ సేఫ్టీ ఇంజినీరింగ్, నాగ్‌పూర్‌వారు అందిస్తున్నారు. పదో తరగతి, ఆపై అర్హత ఉన్నవారు ఈ కోర్సును చేయడానికి అర్హులు.

బీఆర్క్ ఉద్యోగాలు

■ బీఆర్క్ కోర్సులో చేరితే అవకాశాలెలా ఉంటాయి?

– శ్రీరామ్, సింగరాయకొండ

జ: బీఆర్క్ చదివినవారు వివిధ నిర్మాణాల ప్లానింగ్, డిజైనింగ్, నిర్మాణం, సూపర్‌విజన్ బాధ్యతలను నిర్వర్తించాల్సి ఉంటుంది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వీళ్ల అవసరం ఎంతగానో ఉంది. ప్రధానంగా స్పెషల్ డిజైనింగ్, ఆస్థటిక్స్, సేఫ్టీ మేనేజ్‌మెంట్, వివిధ స్ట్రక్చర్ నిర్మాణాల్లో వీరిది ప్రధాన పాత్ర. వీరు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఆర్కిటెక్చరల్ ఇంజినీర్, డిజైనర్, సూపర్‌వైజర్, సైట్ ఇంజినీర్‌గా చేయవచ్చు లేదా సొంతంగా ప్రాక్టీసును కూడా పెట్టుకోవచ్చు. మనదేశంలో నాటా (నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్) పరీక్ష ద్వారా ప్రధాన విద్యాసంస్థల్లో బీఆర్క్‌లో ప్రవేశాన్ని పొందవచ్చు.

పైలట్ అవ్వాలంటే...?

■ పైలట్ అవ్వాలని నాకు అభిలాష. దీనికి కావాల్సిన విద్యార్హతలూ, ఫిటినెస్ ప్రమాణాలు, శిక్షణ సంస్థలు, వాటి సుమారు ఫీజు వివరాలను తెలపగలరు.

– శ్రీకృష్ణ, వరంగల్

జ: పైలట్ అవ్వాలనుకునేవారు 10+2ను మేథమెటిక్స్, ఫిజిక్స్‌లతో పూర్తిచేసినవారు అర్హులు. మనదేశంలో డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ)వారు పైలట్ లైసెన్స్‌ను జారీ చేస్తారు. డీజీసీఏ వారి అనుబంధ, గుర్తింపు పొందిన ఫ్లయింగ్ స్కూల్ నుంచి శిక్షణ పొందినవారికి పైలట్ లైసెన్స్‌ను మంజూరు చేస్తారు.

పైలట్ అవ్వాలంటే ఫిట్‌నెస్‌పరంగా క్లాస్-2 మెడికల్ పరీక్షను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఈ పరీక్షలో అభ్యర్థి ఫిట్‌గా ఉన్నట్లు తేలిన తరువాతే ఫ్లయింగ్ స్కూల్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. పైలట్ ట్రైనింగ్ ఖర్చుతో కూడుకున్నది. ఫ్లయింగ్ స్కూల్‌నుబట్టి ఈ కోర్సుకు సుమారుగా రూ.14 లక్షల నుంచి రూ.16 లక్షల వరకూ ఖర్చు కావచ్చు.

ఇందిరాగాంధీ ఫ్లయింగ్ స్కూల్ మనదేశంలో ప్రఖ్యాత పైలట్ ట్రైనింగ్ సంస్థ. తెలుగు రాష్ట్రాల్లో తెలంగాణ స్టేట్ ఏవియేషన్ అకాడమీ, ఫ్లయింగ్ ఏవియేషన్ అకాడమీ, వింగ్ ఏవియేషన్ మొదలైన సంస్థలు డీజీసీఏ అనుమతితో పైలట్ శిక్షణను అందిస్తున్నాయి.

– ప్రా. బి. రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ, తిరుపతి

పోస్టు: ప్రొఫెసర్/ అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఫేజ్-2)
ఖాళీలు: 50
అర్హత: పీజీ/ నెట్/ స్లెట్/ సెట్/ పీహెచ్‌డీ.
ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్
చివరితేది: 05.02.2018
వెబ్‌సైట్: https://www.svuniversity.edu.in/

ఆంధ్రా యూనివర్సిటీ

పోస్టు: అసోసియేట్ ప్రొఫెసర్/ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఖాళీలు: 337
అర్హత: పీజీ/ నెట్/ స్లెట్/ సెట్/ పీహెచ్‌డీ.
ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్
చివరితేది: 02.02.2018
వెబ్‌సైట్: http://andhrauniversity.edu.in/

వాక్ ఇన్ ఇంటర్వ్యూ

సిర్పూరు కాగజ్‌నగర్ జేఎన్‌వీ

పోస్టు: టీజీటీ (సోషల్ సైన్స్)
ఖాళీలు: 01 అర్హత: బీఏ/ బెట్/ సీటెట్.
ఇంటర్వ్యూ తేది: 18.01.2018.
వేదిక: జేఎన్‌వీ, సిర్పూర్ కాగజ్‌నగర్, ఆదిలాబాద్ జిల్లా.

ఐఐఎఫ్‌బీ, హైదరాబాద్

పోస్టు: కన్సల్టెంట్ తదితర పోస్టులు
ఖాళీలు: 08
అర్హత: ఇంటర్/ డిగ్రీ/ పీజీ/ టైప్ రైటింగ్.
ఇంటర్వ్యూ తేది: 16.01.2018
వేదిక: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ బయోడైవర్సిటీ, దూలపల్లి, హైదరాబాద్.

ప్రవేశాలు

ఐఐడీటీ, తిరుపతి

1) పీజీ ప్రోగ్రామ్ ఇన్ సైబర్ సెక్యూరిటీ 2) పీజీ ప్రోగ్రామ్ ఇన్ బిజినెస్ అనలిటిక్స్ కోర్సు ఫీజు: రూ.4,75,000
కోర్సులు ప్రారంభం: 20.02.2018.
అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ/ పీజీ. ఎంపిక: ప్రవేశపరీక్ష ద్వారా.
ప్రవేశపరీక్ష తేది: 21.01.2018. దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
చివరితేది: 14.01.2018. వెబ్‌సైట్: http:// register.iidt.edu.in/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం
www.eenadupratibha.net చూడవచ్చు.